


# రాధామోహనం

## – దేవరకొండ అన్నపూర్ణ



*ఇది ఒక అందమైన రాధామోహనగాథ. మనందరిలోను అంతర్లీనంగా ఉండి కాలప్రవాహంలో పడి మరిచిపోతున్న ప్రేమాభిమానాలనీ అనుభూతులని గుర్తు చేస్తూ, మనల్ని నవ్విస్తూ, అప్పుడప్పుడూ కళ్ళని చెమరుస్తూ, పనిలోపనిగా మరిచిపోతున్న విలువల్నీ మనుషులుగా మన బాధ్యతలనీ తట్టిలేపే కథామాలిక..!!*

*(గత సంచిక తరువాయి)*

### *5*

#### #గుండే లేని మనిషల్లే

#గుండే లేని మనిషల్లే

"అండా దండా ఉండాలని.. కోదండ రాముని నమ్ముకుంటే
గుండే లేని మనిషల్లే.. నిను కొండా కోనల కొదిలేశాడా
గుండే లేని మనిషల్లే"

జానకమ్మ గొంతులో జీర. కన్నీళ్లతో తన్మయత్వంగా వింటోంది రాధ. మధ్యమావతి రాగం మంద్రంగా గుండెని స్పృశిస్తుంటే, ఆ పాట అర్థం అదే గుండెని మెలిపెడుతున్న భావన. ఎన్ని సార్లు విన్నా కళ్లు చెమర్చే పాటలు – ఇలాంటి పదాల మాయాజాలం సినారె కలంతోనే సాధ్యం, ఇటువంటి సంగీత సామర్థ్యం ఇళయరాజా సొంతం – అనుకుంటూ ఉండగా

ఫోన్ లోనూ, ఇంట్లోనూ ఒకేసారి రింగ్ డోరుబెల్లు గయ్యిమంది. వెళ్లి చూస్తే చీపురూ, వాక్యూమ్ క్లీనర్, డస్టర్లూ పట్టుకుని ప్యాంటు వేసుకున్న పరాశక్తి లా మేరీ, పక్కనే తన కూతురూ, చెల్లెలి కూతురూనూ. చాటంత మొహంతో తలుపు తీసింది రాధ. పాట ఆపేద్దామని ఫోన్ దగ్గరికి వెళ్తుంటే

"వెరీ హంగ్రీ రాధా" – అంది మేరీ

మేటర్నల్ ఇన్స్టింక్ట్స్ కిక్ ఇన్ అయ్యి "నీకిష్టమైన కర్రీ ఇవాళ" అని గుత్తివంకాయ కూర – అన్నం బౌల్లో వేసి ఇచ్చింది. ఆ టీనేజర్లు ఇద్దరూ ఫుడ్ వద్దు అని తలొక

రూమ్ లోకి పని మొదలు పెట్టడానికి వెళ్ళిపోయారు. మేరీ మాత్రం కళ్ళెగరేసి, సింక్లో చేతులు కడుక్కుని చక్కగా చేత్తో కలుపుకుని తింటుంటే, మెక్సికన్ అయినా 7–8 ఏళ్ళ నుంచి రాధ దగ్గరికి రావడం వల్లో తన క్లయింట్స్ ఎక్కువ శాతం ఇండియన్స్ అవ్వడం వల్లో చక్కగా మన వంటలు అలవాటు అయ్యాయి – అనుకుంది. తను క్రిస్టియన్ అనీ దేవుడి పాటలు తప్ప వినను అనీ అంటుంది ఎప్పుడూ, అందుకని పాటలు ఆపేసి పని సంగతి చూస్తూ కాస్త కబుర్లు విందామని వచ్చి ఎదురుగా కూర్చుంది రాధ.

“ఏంటి విశేషాలు. రెండు మూడు నెలలనుంచి ఫోన్ చేస్తే ఎత్తలేదు ఏమైంది. క్లీనింగ్ చేసుకోలేక అల్లాడిపోయాను”

అంటూ

“ఎందుకు ఆపావ్ ? పాట బాగుంది. మీనింగ్ ఏంటి? దేవుడి పాటేనా? బాగా ఎమోషనల్ గా వినిపించింది” అంది మేరీ.

కళ్ళల్లో ఏదో తెలియని దిగులు. దాన్ని కప్పి పుచ్చి సమాధానం దాటవేసింది అని అర్థమైంది. పాట అర్థం చెప్పి

“ఆ అమ్మాయి నమ్మినవాడు వదిలేసి వెళ్లిపోయాడని కన్నీళ్లతో చెపుతోంది” అంది రాధ, మేరీ కళ్ళని జాగ్రత్తగా గమనిస్తూ.

“ఓ... అందరికి ఏదో ఒక ప్రాబ్లెమ్ మరి”

అని లంచ్ బౌల్ సింక్ లో వేసి కిట్ తీస్కుని బాత్రూం లోకి నడిచింది మేరీ. చిన్న నిట్టూర్పు విడిచి లేచింది రాధ కూడా... ఒంటరితల్లి గా పిల్లల్ని పెంచి, ఇమ్మిగ్రేషన్ సమస్యలు, క్లీనింగ్ రసాయనాల వల్ల వచ్చిన ఆరోగ్య సమస్యలు, పిల్లవాడి గర్ల్ ఫ్రెండ్ వల్ల తలనొప్పులు అన్ని తనతో పంచుకుంటుంది మేరీ, కానీ ఇప్పుడేదో దిగులుగా ఉంది అనుకుంది రాధ. కాస్సేపటికి 3 గదులు అయ్యి మేరీ వంటింట్లోకి వచ్చేసరికి – రాధ టీ పెడుతూ

“ఏంటి ఇవాళ కబుర్లు లేవు. ఒంట్లో బానే ఉందా?” అంది.

“ఏముంది చెప్పడానికి, మా చెల్లి కూతురు ఆడ్రియానా తెలుసుగా, ఆ అమ్మాయి కాలేజీ ఆపేసింది. పెళ్లి చేసుకుంటా అని ఒక అబ్బాయితో డేటింగ్, లివిన్ అంటూ కొన్నాళ్ళు సంతోషంగా ఉంది. ఇప్పుడతను వదిలేసి వెళ్ళిపోయాడు చెప్పా పెట్టకుండా. ఈ పిల్ల దిగులు పెట్టుకుని కూర్చుంది. చూసావ్ గా, ఎవరితోనూ మాట్లాడదు, తిండీతిప్పలు మానేసింది, నాతో పాటు పనికి తీసుకువస్తే ఇదీ పరిస్థితి.” అంటూ రాధని ఆడ్రియానా పని చేస్తున్న రూంలోకి తీసుకుని వెళ్ళింది మేరీ.

అక్కడ ఆడ్రియానా గోడకి ఆనుకుని మోకాళ్ళ మీద తల ఆనించి కూర్చుని ఉంది. రూం శుభ్రం చేసేసిందని అర్థమౌతున్నా అలా కూర్చుని ఉండటం చూసి విషయం అర్థమయ్యింది రాధకి.

రాధ వెంటనే

“కంప్యూటర్ సైన్స్ మేజర్ కదూ ఆడ్రియానా! రాత్రి ఎక్కువ చదివితే అలా అలసట గా అనిపిస్తుంది. రా కాస్త తినేసి వీళ్ళ పని అయ్యేదాకా రిలాక్స్ అవ్వచ్చు. ఏంటి మేరీ, చదువుకునే పిల్లని పనులు అని తిప్పుతున్నావు ఇంకా”

అంది పెద్ద గొంతుతో.

ఆడ్రియానా తల ఎత్తేలోపే రాధ మేరీని పై అంతస్థుకి పంపేసి ఆ అమ్మాయి వైపు చూడకుండా

"షీట్స్ మార్చేస్తా, నువ్వు వెళ్ళి తిను – అలసటగా ఉన్నట్టుంది" అంది రాధ లాలనగా.

"మిస్ రాధా!" అంది ఆడ్రియానా లోగొంతుకతో. తలతిప్పి చూసింది రాధ.

"నాకు చదవాలని లేదు. ఏమీ చెయ్యాలనిపించట్లేదు. జీవితంలో అన్నీ కోల్పోయాను. సోఫోమోర్ సంవత్సరంలోనే ఆపేస్తున్నా. మా కోసం మేరీ ఎంతో చేసింది. నేను ఓడిపోయాను, మేరీ ని ఓడిపోయేలా చేసాను"

అంది నిస్తేజంగా చూస్తూ. ఆ అమ్మాయి కళ్ళలో లోతైన బాధ. అనంతమైన నిర్వేదాన్ని నింపుకుని ఇక ఏడవడానికి కన్నీళ్ళు కూడా మిగలలేదు అన్నట్లున్న ఆ కళ్ళు చూసి అసంకల్పితంగా

"నువ్వు ఎటువంటి పరిస్థితుల్లోనుండి కాలేజి దాకా వచ్చావో ఆ స్పిరిట్ ఏమైంది. నీ స్కూల్ అవ్వగానే మేరీ సంబరంగా నాకు ఫోన్ చేసి యూటీ లో సీట్ వచ్చిందని చెప్పి రెండేళ్లు కూడా కాలేదు. నిన్ను నమ్మిన నీ వాళ్ళ ఆశలనీ, నీ కలలనీ నాశనం చేసుకునే ముందు – ఒక్క సారి ఆలోచించు

మేరీ నాకు క్లుప్తంగా చెప్పింది కానీ నీ లాంటి తెలివైన పిల్ల దీనిలోనుంచి తొందరగానే బయట పడుతుంది అన్న నమ్మకం నాది. చెప్పు ఆడ్రియానా. ఈజ్ హి రియల్లీ వర్త్ యువర్ లైఫ్."

అంది రాధ చురుగ్గా చూస్తూ.

"అతనిది కూడా మెక్సికోనే. చాలా కష్టపడి పైకి వచ్చిన వాడే. ఫ్రెష్మెన్గా అక్కడకి వెళ్ళాక మొదట పరిచయం అయ్యింది అతనే. అన్నిటిలోనే తోడుగా ఉండే అతని స్నేహం, తెలివి తేటలు, మాటల్లో సంస్కారం, పదాల మాయాజాలం, అతను నాకు ఇచ్చే ప్రాముఖ్యత ఇవన్నీ నెమ్మదిగా నేనే అతనికి ప్రపోజ్ చేసేలా చేసాయి. లివిన్ రిలేషన్ మొదలయ్యాక ఆ ప్రేమ ఇంకా బలపడింది. ఎప్పుడూ మాకిష్టమైన పుస్తకాలు, సినిమాలు ఇవే మా లోకంగా ఉండేది. యూనివర్సిటీలో అందరికీ కూడా మేము ఒక్కటిగానే తెలుసు. నాకతనే లోకం ప్రపంచం అనుకున్నా".

గొంతు గద్గదమైంది ఆ అమ్మాయికి.

అంతలోనే సర్దుకుని

"మా ఇంట్లో అందరికీ అతనిని పరిచయం చెయ్యడం, వాళ్ళ ఇంట్లో నన్ను పరిచయం చెయ్యడం అవీ అయ్యాయి కూడా. నాకు తెలిసినంత వరకు అతను నా దగ్గర దాచినవి ఏమీ లేవు అనే నమ్మకంతోనే ఉండేదాన్ని. నా వరకు నేను అతనికి తెరిచిన పుస్తకం. కొన్ని సార్లు పక్కకి వెళ్ళి బయటికి వెళ్ళి మాట్లాడినా ఎప్పుడూ అనుమానించలేదు. కొన్ని సార్లు మేము కలిసి వెళ్దామనుకున్న చోటికి వెళ్ళలేక పోయినా నేనే అతనిని కంఫర్ట్ చేసేదాన్ని తప్ప ప్రయత్న లోపంగా ఎప్పుడూ అతనిని వేలెత్తి చూపలేదు. అలాంటి గుడ్డి ప్రేమ వల్లనేమో, అతను ఒక్కటే మాట – 'మా ఇంట్లో ఇబ్బందిగా ఉంది. మనకి కుదరదు' అని చెప్పి వెళ్ళిపోయాడు. నేను బాధ పడుతున్నానని తెలిసీ, కుమిలిపోతున్నాననీ తెలుసు కానీ 'నువ్వు రాంగ్ పర్సన్ కాదు ఇది రాంగ్ ప్రపోజిషన్' అని చెప్పాడే కానీ మళ్ళీ నాతో మాట్లాడలేదు. క్రిందటి

వారమే ఇంకొక అమ్మాయితో బయట కనిపించాడని మా ఫ్రెండ్ చెప్పింది. దీన్ని తట్టుకునే శక్తి లేదు కానీ అతనిని ద్రోహం చేసాడు అనడానికి కూడా మనసు రావట్లేదు. బయటపడలేక పోతున్నాను. మళ్ళీ కాలేజికి వెళ్తే అతనిని చూడాల్సి వస్తుంది, అది తట్టుకోలేని అశక్తత నాది"

తల వంచుకుని నెమ్మదిగా చెప్తూ ఆగింది ఆ అమ్మాయి.

"చదువు మానెయ్యడం, లేకపోతే ఇది ఓటమి అని కుమిలిపోవడం – ఈ రెండింటిలో ఏదీ నీ సమస్యకి పరిష్కారాలు కాదు. లేచి తిను. మాట్లాడదాం" అని లేచింది రాధ వాతావరణాన్ని తేలిక చేస్తూ.

ఆడ్రియానా కి ఫుడ్ ఇచ్చి మేరీ ఉన్న గదిలోకి వెళ్ళి, ఆడ్రియానా తో జరిగిన సంభాషణ అంతా చెప్పింది రాధ,

"నేను 30ల్లోనే పిల్లల్తో ఒంటరి దాన్ని అయిపోయాను. నా అనుకున్న వాడు చెప్పాపెట్టకుండా

తన సంతోషం చూసుకుని వెళ్ళిపోయాడు. సారీ చెప్పాడులే. గుండెల్లో తూట్లు పొడిచి నోటితో సారీ చెప్పాడు. దాని నుంచి నేను ఇప్పటికి ఎప్పటికి కోలుకోలేకపోతున్నాను. మగవాడిని మాత్రం నమ్మకూడదు అనేంతగా డిప్రెషన్ లోకి వెళ్ళి నాకు నేనే కోలుకుని నా పిల్లలు, చెల్లి పిల్లల్ని కూడా నేనే అమెరికా తెచ్చి పని చేసుకుంటూ కష్టపడి పెంచాను. పిల్ల ప్రేమంది, పెళ్ళి చేసుకుంటాను అంటే కాదనలేక పోయాను.. ఇప్పుడు ఆ పిల్ల మనలో లేదు.. అతని జాడ తెలియట్లేదు"

అంది మేరీ దిగులుగా.

" సరేలే మేరీ, అతని పరిస్థితి ఏంటో మరి. మనకి తెలియదుకదా. ముందు అసలు ఏమి జరిగిందో తెలుసుకోవడం, జరగాల్సింది ఆలోచించడం ముఖ్యం, గ్రీన్ కార్డు వస్తుంది డ్రైవింగ్ స్కూల్ పెడతా అన్నావ్. ఆ పిల్ల ని చూసుకోమను. కొంత మార్పు ఉంటుంది. ఈ సమయంలో బాధలో ఇంకొక తప్పు జరిగే అవకాశమే ఎక్కువ. కాబట్టి నీలా సొంతగా నిలద్రొక్కుకొమ్మను. కమ్యూనిటీ కాలేజీలో చదువు పూర్తి చెయ్యమను. తర్వాత ప్రేమ–పెళ్ళి సంగతి అని మాట్లాడదాం"

అంది రాధ.

ఇంచుమించు రాధ వయసే మేరీ ది కూడా కానీ చిన్నవయసు లో పిల్లలు, బాధ్యతలు, ఒంటరి ప్రయాణం అన్నీ మీదపడి పెద్దదానిలా కనపడుతుంది. వచ్చిన ప్రతిసారీ ఊళ్ళో కబుర్లు చెప్తున్నాఅవి ఊసిపోని గాలి కబుర్లలా కాక ఓ తత్వవేత్తలా, సైకాలజిస్ట్ లా విశేషిస్తుంది మేరీ. ఇవాళ మాత్రం మాటల్లో అంతకు మించిన బాధ వినిపిస్తోంది అనుకుంది రాధ.

మెక్సికన్ కుటుంబాలు కూడా భారతీయ కుటుంబల్లాగే కొంచెము కన్సర్వేటివ్గా ఉంటారని ఒంటరిగా ఉన్న తనని సూటిపోటి మాటలు కూడా అన్నారని అదివరకు మాటల్లో చెప్పింది. తన బాధ పైకి కనపడనివ్వకుండా, ఎవరిమీద ఆధారపడకుండా, తనకి చేతనైన క్లీనింగ్ పని చేస్కుంటోంది. అందుకే రెగ్యులర్గా రాదనే సమస్య ఉన్నా ఇన్నేళ్ళ నుంచి మేరీ ని మార్చలేదు రాధ.

పైన అంతా పని అయ్యాక కిందకి వచ్చింది మేరీ. ఆడ్రియానా వినేలాగే రాధతో –

"పిల్లవాడు మంచివాడే. కానీ స్థిరత్వం లేదు. ఎటుగాలి వస్తే అటు ఊగిపోతాడు. ఏదో ఇంట్లో వాళ్ళు ఫోన్ చేశారు అని వెళ్ళిపోయాడు.

ప్రేమ అంటే అర్థం చేసుకుంటే అంతా బాగుంటుంది రాధా. నాకు తెలిసినంత వరకూ – పొసెసివ్గా ఉండటం తప్పు లేదు, అబ్సెషన్లా ఉండకూడదు కదా. ఏ సంబంధం అయినా కొంత వ్యక్తిగత స్వేచ్ఛ ఉండాలి. నేను అదే తప్పు చేశాను. నా భర్తతో — నువ్వే నా లోకం, నేను నీకు ప్రాణం అన్నట్లు గుడ్డిగా ఉండేదాన్ని. నా వరకూ అలా బాగుంది కాని మగవాడికి తిండి, బట్ట, ఇల్లు, పెళ్ళాం పిల్లలు అన్నీ వచ్చాక — అన్వేషణ — అంతర్మధనం మొదలవుతుంది. మిడ్ లైఫ్ క్రైసిస్ ఉంటుంది. ఇంకా ఏదో కావాలని తపన మొదలవుతుంది. కొంత మంది సోషల్ సర్వీస్, లేకపోతే అందరిలో వావ్ అనిపించుకోవాలి అన్న కోరిక, తీరని ఫాంటసీలు, కొంతమంది పబ్లిక్ లైఫ్, మరి కొంతమంది గోల్ఫ్, స్పోర్ట్స్. మరి కొంతమంది తాగుడు తిరుగుడు. రకరకాల పోకడలు మొదలవుతాయి. ఆ నీడ్స్ నాకు అర్థం కాలేదు రాధా. మరీ అబ్సెసివ్ గా ఉండి అతను వదిలి వెళ్ళిపోయే దాక తెచ్చుకున్నాను. అర్థం చేస్కుని తోడుగా ఉండిఉంటే వేరేగా ఉండేది. ఇప్పుడు అందరినీ చూస్తే అనిపిస్తుంది. కొన్ని విషయాల్లో రాజీ పడుతూ కొన్ని విషయాల్లో తోడుగా ఉంటూ ఎవరి వ్యక్తిగత స్వేచ్ఛ వాళ్ళకి అవసరం అని అర్థం చేస్కునేవాళ్ళు హ్యాపీ గా ఉన్నారు అని. నేను ఓడిపోయాను. నా చెల్లెలు కూతురిలో నన్ను చూసుకున్నాను అందుకే దానికి సర్దిచెప్పడానికి కూడా నా దగ్గర శక్తి లేదు అంది"

ఆశ్చర్యపోయింది రాధ. **మెన్ ఆర్ ఫ్రొమ్ మార్స్ – వుమెన్ ఆర్ ఫ్రొమ్ వీనస్, లవ్ అండ్ రెస్పెక్ట్, హిస్ నీడ్స్ హర్ నీడ్స్** ఈ పుస్తకాలు ఏవి చదివి ఉండదు మేరీ. ఎలిమెంటరీ లో చదువు ఆపేసి క్లీనింగ్ లోనే జీవితంలో సింహభాగం గడిపేసింది. తన కన్నీళ్ల నుంచి చేదుని కాక జీవిత సత్యాల్ని గ్రహించింది అంటే చాలా అద్భుతమైన వ్యక్తిత్వం అనిపించి, దగ్గరికి వెళ్లి చిన్నగా తట్టి

"సరిగ్గా అర్థం చేసుకున్నావ్ నువ్వు తప్ప ఇంకెవ్వరు ఆ అమ్మాయికి మార్గదర్శకులవ్వలేరు, గుడ్ లక్" అంది రాధ.అక్కడే కూర్చున్న ఆడ్రియానా రాధ వైపు చూసి —

" ఐ విష్ ఐ లివ్ అప్ టు ఇట్"

అంది నిర్వేదంగా.

'యూ విల్, యూ ఆర్ ఇన్ సేఫ్ హేండ్స్. నిన్ను మించి ఎవ్వరినీ ఎక్కువగా ప్రేమించకు. ప్రేమించినా చెప్పకు. చెప్పినా నీ ఉనికిని కోల్పోకు. ప్రేమించడంలో ఉన్న దైవత్వం దానితో పాటు వచ్చే హక్కులు, ప్రత్యాశ ( Expectation) తో మటుమాయం అవుతుంది.

ఒకప్పుడు ప్రేమ విఫలం అవ్వడానికి కులాలు మతాలు ఆస్థులు అంతస్థులు కారణం కానీ ఇప్పుడు ప్రేమ విఫలం అవ్వడానికి ప్రేమికులిద్దరూ చాలు. ఇగోల వల్ల ఎక్స్పెక్టేషన్ల వల్ల ప్రేమ అనేది చాలా తక్కువ సమయంలోనే పోయి ఆ స్థానంలో అసహనం, దాని వల్ల ప్రక్క దారులు పట్టడం పరిపాటి అయిపోయింది. నీకు ముందు జీవితంలో స్థిరపడటం అన్నింటికన్నా ముఖ్యం. మేరీ చెప్పినట్లు ముందు ఆ బాధ లోనుంచి వీలైనంత త్వరగా బయటపడు. జీవితం అందమైనది, ఇంకా ఎంతో భవిష్యత్తు ఉంది, దానికి బంగారు బాటలు వేసుకో, సరయిన సమయంలో నీకు నచ్చిన నీకు తగిన వారు తారసపడకపోరు. అప్పుడు ప్రేమని చక్కగా ఆస్వాదించగలవు కూడా"

అంది రాధ.

మేరీ అంగీకారంగా నవ్వి —

"నిజమే రాధా. నా భర్త కూడా వదిలి వెళ్ళిపోయాడు. అందుకే ఇందాక పాట అర్థం నువ్వు చెప్పగానే – విని లోపల నుంచి బాధ వచ్చింది. మళ్ళీ పెడతావా రాధా, అర్థం కాకపోయినా వినాలని ఉంది"

అంది.

సంగీతానికి భాషతో పనేముంది అనుకుంటూ – రాధ వెళ్లి పాట రెస్యూమ్ చెయ్యగానే

"చుట్టూ ఉన్నా చెట్టు చేమ తోబుట్టువులింకా నీకమ్మా
ఆగక పొంగే కన్నీళ్ళే నీ ఆకలి దప్పులు తీర్చేనమ్మా

పట్టిన గ్రహణం విడిచి నీ బతుకున పున్నమి పండే ఘడియ
వస్తుందమ్మా ఒకనాడు చూస్తున్నాడు పైవాడు

వస్తుందమ్మా ఆ నాడు చూస్తాడా ఆ పైవాడు

సువ్వి సువ్వి సువ్వీ"

బాలు గొంతులో ఆప్యాయత, జానకమ్మ గొంతులో ఆర్ధ్రత అద్భుతమైన అనుభూతిని ఆవిష్కరిస్తుంటే –

భాష రాని మేరీ నా వైపు చూసి

"హోప్ షీ ఫైండ్స్ సమ్ సపోర్ట్"

అంది పాటలో మగ గొంతు ధైర్యం చెప్తున్నాడని అర్ధమయ్యి.

డిన్నర్ ప్యాక్ చేసి చెక్ ఇచ్చి మేరీవాళ్ళని పంపిన తర్వాత స్వాతి ముత్యం సినిమా చూడాలనిపించింది రాధకి.

గుండె గుండెలో ఎన్నికథలు ఎన్ని వెతలు. "వస్తుందా ఆ నాడు.... చూస్తాడా ఆ పైవాడు" అన్న మాట గుండెను బరువు చేస్తుంటే కూర్చుని సినిమా చూస్తుండగా మోహన్ వచ్చాడు

"ఏంటోయ్ విశ్వనాధ్ గారు ఇంటికొచ్చారు"

అంటూ. మామూలుగా ఇద్దరూ కూర్చుని ఇష్టంగా చూసే సినిమాల్లో కే. విశ్వనాధ్ సినిమాలు ఎక్కువుంటాయి. రాధ ఒక్కత్తే చూస్తోందని ఆశ్చర్యం అనిపించింది మోహన్ కి. మేరీ తో సంభాషణ, ఆమె విశ్లేషణ అంతా చెప్పింది రాధ పెద్ద పెద్ద కళ్ళు చేస్కుని. విశాలంగా నవ్వాడు మోహన్..

"అవును రాధా. చక్కగా చెప్పావు ఆ అమ్మాయికి. అంత కన్నా అధ్భుతమైన విషయం – మేరీ పరిశీలనా శక్తి, తను చేసిన తప్పుని అర్థం చేసుకోవడమే కాదు, చక్కటి పరిణతితో ప్రవర్తించి పిల్లలకి దారి చూపించగలిగింది కదా.

ఇక్కడ సమస్య ప్రేమికులదొక్కటే కాదు. పెళ్ళయిన వాళ్లు కూడా తొందర పడి సంసారాలు పాడుచేసుకుంటున్న వాళ్ళు, ఆడవాళ్లు అయినా మగవాళ్ళు అయినా, ఇగో వల్ల దూరం ఐపోతున్నారు అంటే ముఖ్య కారణం – ఎదుటి వాళ్ళ వ్యక్తిగత స్వేచ్ఛని గౌరవించకపోవడం, నీడ్ ఫర్ స్పేస్ ని గుర్తించకపోవడం. ప్రేమికులైనా ఆలుమగలైనా రైలు పట్టాలలా, సమాంతర రేఖల్లా, కలిసి ఉంటూనే, బాధ్యతగా ప్రవర్తిస్తూ ఎవరి వ్యక్తిగత స్వేచ్ఛని వాళ్ళు ఎంజాయ్ చేస్తూ జీవితాంతం కలిసి సాగాలి. ఇంటర్సెక్ట్ అయితే ఏక్సిడెంట్స్ తప్పవు.

మేరీ విషయంలో అతను ఉక్కిరి బిక్కిరి అయ్యి ఉండవచ్చు అది ఆమె ఆలస్యంగా అర్థం చేసుకుంది.. తన చెల్లెలి కూతురి విషయంలో పిల్లవాడు వేరే ఒత్తిడులకు తల ఒగ్గాడు అని అర్థం చేసుకుంది అందుకే తన తప్పు ఆ పిల్ల చెయ్యకూడదు అని మధన పడుతోంది.

ప్రేమించడం అంటే అవతల వారి అవసరాలని, బలహీనతల్ని అర్థం చేస్కోవడం. అడిగినప్పుడు సలహాలు ఇచ్చి సపోర్ట్ చెయ్యడం. మగవారికైనా ఆడవారికైనా ఇదే రూల్. ఏ పుస్తకాలు చదివినా ఇదే ఉంటుంది.. ఏ సైకాలజిస్ట్ అయినా ఇదే చెప్తాడు. కాదని విడిపోతే — అంత కన్నా గొప్ప వాళ్ళు దొరుకుతారు అనుకోవడం

కూడా అమాయకత్వమే. విడిపోవడం చాలా సులభం దాని తాలూకు ప్రభావం జీవితాంతం అన్ని సందర్భాల్లోనూ గుర్తొస్తూ – ఇది తప్పేమో ఇదే ఒప్పేమో అని అనిపిస్తూనే ఉంటుంది. కొంత పరిణతి కలిగిన మనుషులు చేదుగా మారకుండా ఉంటారు. అది లేని వాళ్ళు తాము బాధ పడుతూ, అందరిని బాధ పెడుతూ జీవితాన్ని నరకప్రాయం చేసుకుంటారు.

ఇక్కడ స్త్రీ పురుష సమానత్వమే — కీలకమైన అంశం. **'కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ, రూపేచ లక్ష్మీ, క్షమయా ధరిత్రీ, భోజ్యేషు మాతా, శయనేషు రంభా షట్కర్మ యుక్తా కుల ధర్మపత్నీ..'** అంటూ స్త్రీ ఎలా ఉండాలో చెప్పారు కదా. మరి పురుషుడు ఎలా ఉండాలో చెప్పలేదా – **'కార్యేషు యోగీ, కరణేషు దక్షః, రూపేచ కృష్ణః, క్షమయా తు రామః , భోజ్యేషు తృప్తః, సుఖ దుఃఖ మిత్రం , షట్కర్మ యుక్తః ఖలు ధర్మనాథః'**– అని పురుషుడు ఎలా ఉండాలో కూడా చెప్పారు. పురుషాధిక్య సమాజాన్ని ఆపాదిస్తున్న భారతదేశ చరిత్రలో ఎక్కడ చూసినా స్త్రీస్వామ్యమే కనబడుతుందమ్మా. **'యత్ర నార్యంతు పూజ్యంతు రమంతే తత్ర దేవతాః'** అని గౌరవించబడినా, **'అమ్మల గన్న యమ్మ'** అని — **శక్తి స్వరూపంగా పూజించిబడినా, వివాహ సమయాలలో 'ధర్మేచ, కామేచ, నాతి చరామి' అని పురుషుల** చేత — 'తాను జీవితంలోని ప్రతి విషయంలోనూ స్త్రీతోనే కలిసి నడుస్తాను' అని చెప్పించినా — అది స్త్రీకి పురుషునికి సమానమైన బాధ్యతని ఆపాదించడమే కదమ్మా.

మాకు తెలిసిన ఓ పెద్దాయన 'వైజ్ మెన్ ఫాలో విమెన్' అంటే 'ఎంత మంది ఐతే బెటర్ సార్' అని అడిగాడు మా ఫ్రెండొకడు. నేను మాత్రం ఏదో నిన్ను ఫాలో ఐపోతున్నా కనుక — ఇక దాన్ని మర్చిపోయి... ఈ అన్నార్థుడికి కొంచెం డిన్నర్ పెడితే."

గంభీరంగా మాట్లాడుతూనే మధ్యలో కొంటె కోణంగిలా కోతికొమ్మచ్చి ఆడేస్తున్న మోహన్ నోటికి చెయ్యి అడ్డు పెట్టి, నుదిటిపై చిన్న ముద్దు పెట్టి

**"నగుమోము గలవాని నా మనోహరుని, జగమేలె శూరుని జానకి వరుని , దేవాది దేవుని దివ్యసుందరుని శ్రీవాసుదేవుని సీతారాఘవుని , సుజ్ఞాననిధిని సోమసూర్యలోచనుని, అజ్ఞానతమమును అణచు భాస్కరుని !"**

అని పాడుతూ వంటింట్లోకి వెళ్ళింది రాధ తేలికపడ్డ మనసుతో.

*(వచ్చే నెల మరో మోహనం)*

Post your comments